AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


## ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డికి ఎమ్మెల్యే మదన్‌మోహన్ శుభాకాంక్షలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్ రెడ్డికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం సెక్రటేరియట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వారు చర్చించారు.


6-11-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## ప్రాజెక్టులలకు కొనసాగుతున్న వరద..


**అక్షరటుడే, మెండోరా/ఎల్లారెడ్డి :** శ్రీరాంసాగర్, నిజాంసాగర్‌లకు వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో అధికారులు జలాశయాల్లోని మిగులు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు బాబ్లీ నుంచి ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు గురువారం నాలుగు వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 21,954 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. జలాశయం నీటినిల్వ సామర్థ్యం 80.501 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం అంతేస్థాయిలో నీరు నిల్వ ఉంది.

**నిజాంసాగర్‌లో..**

నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వస్తోంది. జలాశయంలోకి ప్రస్తుతం 9,570 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు రెండు గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. అంతే మొత్తంలో నీరు నిల్వ ఉంది.

## రేపు వందేమాతరం సామూహిక గీతాలాపన

**అక్షరటుడే, ఇందూరు:** వందేమాతం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్లో ఉదయం 10 గంటలకు సామూహిక గీతాలాపన ఉంటుందని పేర్కొన్నారు. కలెక్టరేట్ సహా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతరం గీతం ఆలపించాలని ఆదేశించారు. మహాకవి బంకిం చంద్ర చటర్జీ 'వందేమాతరం' గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పౌరుడిలో దేశ భక్తి భావాన్ని మరింతగా పెంపొందించేందుకు, దేశ చరిత్రలో వందేమాతరం గీతానికి గల ప్రాధాన్యతను చాటి చెప్పడానికి గీతాలాపన చేయనున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో కూడా వందేమాతరం ఆలపించాలని ఆదేశించారు.





## అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న మహిళ అరెస్ట్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** భూములు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి.. అక్రమంగా ప్రజల వద్ద డబ్బులు వసూలు చేస్తున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సౌత్ రూరల్ సీఐ సురేష్ గురువారం వెల్లడించారు. నిజామాబాద్‌కు చెందిన స్వర్ణ ప్రమీల మోపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదుగురు వ్యక్తుల వద్ద మూడు ఎకరాల భూమి ఇప్పిస్తానని చెప్పి నమ్మించింది. వారి వద్ద నుంచి రూ.38,15,000 డబ్బులు తీసుకొని మోసం చేసింది. కేసు నమోదు చేసిన మోపాల్ పోలీసులు నిందితురాలిని గురువారం అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి బాధితులు సంతకాలు చేసిన ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సదరు మహిళ చేతిలో మోసపోయిన బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సీఐ కోరారు. బాధితులు ఫిర్యాదు చేస్తే తగిన చర్య తీసుకుంటామని అన్నారు. సమావేశంలో మోపాల్ ఎస్సై సుస్మిత, సిబ్బంది పాల్గొన్నారు.

రోజురోజుకు నగరాలు, పట్టణాలు విస్తరిస్తున్నాయి. పట్టణ జనాభా పెరుగుతోంది. ప్రధానంగా వాహనాల సంఖ్య రెట్టింపు అవుతోంది. దీంతో ఎక్కడ చూసినా ఇరుకైన రోడ్లతో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలోని ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీలతోపాటు నిజామాబాద్ నగర పాలక సంస్థలోని మాస్టర్ ప్లాన్ అమలుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కసరత్తు పూర్తి చేసి నివేదికలు అందజేస్తున్నారు.

– అక్షరటుడే, ఇందూరు



# తెరపైకి మాస్టర్ ప్లాన్

■ బోధన్, ఆర్మూర్‌లో ప్రక్రియ పూర్తి ■ నిజామాబాదులోనూ కసరత్తు

జిల్లాలోని ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ పూర్తి చేశారు. ఇటీవల కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సైతం రెండు మున్సిపాలిటీల అధికారులతో సమావేశం నిర్వహించి పర్యవేక్షించారు. ఇప్పటికే డ్రోన్ సర్వే పూర్తి చేయడంతో తుది నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గత నెల 28న సబ్ కలెక్టర్లు, మున్సిపల్ అధికారులతో భేటీ అయి నివేదిక అందజేయడానికి 10 రోజుల సమయాన్ని ఇచ్చారు.

**బోధన్‌లో..**

జిల్లాలో ప్రధాన పట్టణంలో బోధన్ ఒకటి. సుమారు 60 ఏళ్ల క్రితం మున్సిపాలిటీగా ఏర్పడింది. ప్రస్తుతం గ్రేడ్-1 మున్సిపాలిటీగా కొనసాగుతోంది. మొత్తం 21 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఆవరించి ఉంది. గత పదేళ్లలో నూతన కాలనీలు, నివాస గృహాలు విపరీతంగా పెరిగిపోయాయి. కానీ ప్రధాన రోడ్డు మాత్రం ఏళ్లుగా అలాగే ఉంది. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. ప్రధానంగా శివారు ప్రాంతాల్లో ఏర్పడిన నూతన కాలనీలో సరైన సౌకర్యాలు కూడా లేవు. దీంతో రోడ్ల సంఖ్యను పెంచడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే మాస్టర్ ప్లాన్ పూర్తి డ్రాఫ్ట్ రూపొందించినట్లు సమాచారం.

**ఆర్మూర్ పట్టణంలో..**

ఆర్మూర్ 2006లో మున్సిపాలిటీగా ఏర్పడింది. జాతీయ రహదారి 44కు అతి సమీపంలో ఉండడంతో పట్టణ పరిధి కూడా ప్రతి ఏడాది పెరుగుతోంది. ఇప్పటికే చుట్టుపక్కల ఉన్న అంకాపూర్, పెర్కిట్, చేపూర్ తదితర గ్రామాలు కూడా పట్టణంలో కలిసిపోతున్నాయి. ముఖ్యంగా కమర్షియల్ భవనాలు పెరగడం, వ్యాపారాలు విస్తరించడంతో రద్దీ ఎక్కువవుతోంది. అలాగే ఆర్మూర్‌లోకి వెళ్లే ప్రధాన రహదారి ఒకటే ఉండడం, నిజామాబాద్‌కు వెళ్లే వాహనాలు అదే మార్గంలో రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతుంది. దీంతో అధికారులు మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. డ్రాఫ్ట్ కూడా రూపొందించి ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

**నిజామాబాద్‌లో అయ్యేనా..**

రాష్ట్రంలోని అతిపెద్ద నగరాల్లో నిజామాబాద్ ఒకటి. మున్సిపాలిటీ నుంచి నగరపాలక సంస్థగా ఏర్పడినప్పటికీ రోడ్లు మాత్రం అనుకున్న స్థాయిలో లేవు. రోజురోజుకు నగర పరిధి విస్తరిస్తోంది. వ్యాపార సముదాయాలతో పాటు వాహనాల సంఖ్య పెరుగుతున్నాయి. దీంతో నగరంలో నిత్యం ట్రాఫిక్‌తో నరకం అనుభవిస్తున్నారు. 30 ఏళ్లుగా మాస్టర్ ప్లాన్ అమలు చేయలేకపోవడం, 15 ఏళ్ల నుంచి నగరం వేగంగా అభివృద్ధి కావడంతో తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికే నగర జనాభా సుమారు 4 లక్షల వరకు ఉంది. అయితే జనాభా, నగర విస్తీర్ణ ప్రతిపాదికన మాస్టర్ ప్లాన్‌కు డ్రాఫ్ట్ సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

## నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ నగర సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వార్డ్ ఆఫీసర్లు తమ డివిజన్‌లో నెలకొన్న పరిస్థితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయగలరని తెలిపారు. ఖాళీ స్థలాలను గుర్తించి వాటి పరిరక్షణ కోసం కంచె ఏర్పాటు చేయాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేలా విరివిగా మొక్కలు నాటించాలని ఆదేశించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. చెత్త సేకరణ వాహనాలు నిత్యం ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరించేలా కృషి చేయాలన్నారు. అవకాశం ఉన్నచోట డ్రెయినేజీలను శుభ్రపరిచేందుకు జేసీబీలను వినియోగించాలని చెప్పారు. చెడిపోయిన యంత్రాలు, స్వీపింగ్ వెహికల్స్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 400 చదరపు అడుగుల కంటే తక్కువ స్థలం ఉన్నవారు కూడా జీ ప్లస్ వన్ పద్ధతిలో ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం



అనుమతించిందన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. లబ్ధిదారులు ఇల్లు నిర్మాణాలు చేపట్టి సకాలంలో పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, హౌసింగ్ డీఈ నివర్తి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక వికాసం




**అక్షరటుడే, ఆర్మూర్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం వల్ల మానసిక వికాసం కలుగుతుందని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో మహాత్మ జ్యోతిరావు పూలే జూనియర్, డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ఆటలు ఆడడం వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుందన్నారు. ప్రతి విద్యార్థికి చదువుతోపాటు క్రీడలు సైతం జీవింలో భాగం కావాలన్నారు. అనంతరం విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లింబాద్రిగుట్ట అర్చకులపై ఫిర్యాదు



**అక్షరటుడే, భీమ్‌గల్ :** భీమ్‌గల్ లింబాద్రి గుట్ట బ్రహోత్సవాల్లో భాగంగా విధి నిర్వహణలో ఉన్న అధికారులు, విలేకరులతో పాటు భక్తులపై దురుసుగా ప్రవర్తించిన అర్చకులపై భీమ్‌గల్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. జాతర బ్రహ్మోత్సవాల వార్తలను సేకరించడానికి వెళ్లిన విలేకరులతో నంబి వంశస్థులతో పాటు ఇతర అర్చకులు దురుసుగా ప్రవర్తించారని, అసభ్యకరంగా మాట్లాడి అవమానించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రథ భ్రమణం సందర్భంగా తాడును లాగుతున్న భక్తులపై పిడిగుద్దులు కురిపించారన్నారు. అన్నసత్రంలో సేవ పేరిట కొందరు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడం, భక్తులను తిట్టడం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై సందీప్ మాట్లాడుతూ.. తమ అందిన ఫిర్యాదు మేరకు లింబాద్రిగుట్ట అర్చకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## 15న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్ యాత్ర 15న మధ్యాహ్నం 3 గంటలకు డిపో నుండి బయలుదేరుతుందని డీఎం రవికుమార్ తెలిపారు. ఆర్మూర్ నుంచి బయలుదేరి అరుణచలం, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అలంపూర్ జోగులాంబ అమ్మ వారి శక్తి పీఠం తిరిగి ఆర్మూర్‌కు బస్సు చేరుతుందన్నారు. ఛార్జీలు పెద్దలకు ఒకరికి రూ. 5,100 ఉంటుందని, టికెట్ ముందస్తుగా బస్టాండ్ లోనీ రిజర్వేషన్ కౌంటర్ లో తీసుకొనే సౌకర్యం ఉందని పేర్కొన్నారు.



## నీలకంఠేశ్వర ఆలయంలో కవిత పూజలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని నీలకంఠేశ్వరాలయంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఆమె స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మాట్లాడారు. ప్రజలకు కార్తీక పౌర్ణమి, కార్తీక మాస శుభాకాంక్షలు తెలిపారు. కార్తీక పౌర్ణమి మరుసటి రోజున ఎప్పటిమాదిరిగానే శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారికి అభిషేకం చేసినట్లు ఆమె చెప్పారు. స్వామివారి దయతో జిల్లా ప్రజలు బాగుండాలని కోరుకున్నట్లు తెలిపారు. మొంథా తుపానుతో రాష్ట్రంలో అనేక నష్టం జరిగిందన్నారు. ప్రజలంతా మనోధైర్యంతో ఉండాలని ఆమె సూచించారు. మంచి రోజులు వస్తాయని చెప్పారు.

## సర్దార్ పటేల్ జీవితంపై చిత్రలేఖన పోటీలు

**అక్షరటుడే, ఇందల్వాయి:** సర్దార్ వల్లాభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. తెయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రొఫెసర్ అపర్ణ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. విశ్వవిద్యాలయ విద్యార్థులతో పాటు ప్రభుత్వ డిగ్రీ, తెలంగాణ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు, తెలంగాణ గిరిజన సంక్షేమ కాలేజీల నుంచి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్.స్వప్న, బి.శ్రీవంతి, డాక్టర్ అహ్మద్ అబ్దుల్ హలీమ్ ఖాన్ వివిధ విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.





## చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, క్రీడలతో ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పిప్రి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 11వ జోనల్ లెవెల్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని కళాశాల మైదానంలో గురువారం నిర్వహించారు. ఈ క్రీడల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు దేశ ఐక్యతలో భాగమని, క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, శరీర దారుఢ్యం పెంపొందుతుందన్నారు. ఆధునిక కాలంలో పిల్లలు ఆటలకు దూరం అవుతున్నారన్నారు. అనంతరం విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో విజేతలుగా నిలిచిన కళాశాలలకు బహుమతులను అందజేశారు. రాకేష్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు స్పోర్ట్స్ టీషర్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాలల అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



## సుర్బిర్యాల్‌లో భక్తిశ్రద్ధలతో భీమన్న ఉత్సవాలు

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మండలంలోని సుర్బిర్యాల్ గ్రామంలో భీమన్న ఉత్సవాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిని ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం సభ్యులు సన్మానించారు.

## శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** జక్రాన్‌పల్లి మండలంలోని సికింద్రాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో శీను నాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు పాఠశాలలోని సుమారు 75 మంది విద్యార్థులు, 8 మంది ఉపాధ్యాయులకు, అలాగే సికింద్రాపూర్ గ్రామంలోని 50 మంది ప్రజలకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం దంత సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దంతాలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా వెంటనే దంత వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్‌లో డయాబెటిస్ పరీక్షా శిబిరం




**అక్షరటుడే, బీర్కూర్:** బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కామప్ప చౌరస్తా వద్ద ఉచిత డయాబెటిక్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారు 55 మందికి పైగా రోగులకు షుగర్ టెస్టులు నిర్వహించగా, అందులో ఏడుగురికి షుగర్ స్థాయి అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వారికి బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సితలె రమేష్, ట్రెజరర్ మేకల గాలయ్య, జోన్ ఛైర్మన్ కొట్టూరి సంతోష్, సీనియర్ లయన్స్ సభ్యులు కిషోర్ దాస్, కార్తీక్ పటేల్, ల్యాబ్ టెక్నీషియన్ నారం ప్రవీణ్ పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన సదస్సు

**అక్షరటుడే, ఆర్మూర్:** ముప్కాల్ మండల కేంద్రంలో పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై గంగారాం మాట్లాడుతూ.. సైబర్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెలియని లింకులు క్లిక్ చేయవద్దన్నారు. వ్యక్తిగత బ్యాంక్ వివరాలు ఎవరికీ వెల్లడించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ప్రజలు సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# పడగ విప్పుతున్న ప్లాస్టిక్ భూతం



ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా.. ప్రజలు వినియోగిస్తూనే ఉన్నారు. 75 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండడంతో ప్లాస్టిక్ కవర్ల వాడకం ఇటీవల జోరందుతుంది. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి.. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ప్రచారం చేస్తున్న అధికారులు.. క్షేత్రస్థాయిలో మాత్రం చర్యలు చేపట్టడం లేదు. దీంతో దుకాణాల్లో వీటినే అందిస్తున్నారు.


**- అక్షరటుడే, ఇందూరు**

- పల్లెలు, పట్టణాల్లో విచ్చలవిడిగా వినియోగం
- పర్యావరణంపై తీవ్ర ప్రభావం
- నిషేధం ఉన్నా.. చర్యలు చేపట్టని అధికారులు

రాష్ట్రంలో 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు, అలాగే సింగిల్ యూస్ కవర్లను పూర్తిగా నిషేధించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా కవర్లను వినియోగిస్తే భారీ జరిమానాలతో పాటు వారిపై కేసులు నమోదు చేస్తారు. ఈ నిబంధన 2022 జూలై 1 నుంచి అమలులోకి వచ్చింది. ప్రారంభంలో అధికారులు కూడా జోరుగా ప్రచారం కల్పించారు. పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టారు. కానీ ఇటీవల మళ్లీ తక్కువ మందం ఉండే కవర్ల వాడకం పెరిగింది.

### నిబంధనల ఉల్లంఘన

ఉమ్మడి జిల్లాలో ప్లాస్టిక్‌పై నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. టిఫిన్ సెంటర్లు, కూరగాయలు, పండ్లు విక్రయించే తోపుడు బండ్లు, కిరాణా దుకాణాలు తదితర వ్యాపారస్తులు తక్కువ మందంగల ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. ఏ వస్తువు కొనుగోలు చేసినా వాటిలోనే ఇస్తున్నారు. ఇటీవల మార్కెట్లో అతి తక్కువ మందంగా గల నలుపు, నీలిరంగు కవర్ల వాడకం పెరిగింది. ప్రజలు కూడా జ్యూట్ బ్యాగులు, చేతి సంచులు వాడకపోవడంతో వ్యాపారస్తులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.



### అధికారుల తనిఖీలు కరువు

ఉమ్మడి జిల్లాలో ప్లాస్టిక్ కవర్ల వాడకంపై అధికారుల తనిఖీలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఏడాదిలో ఒకటి రెండు సార్లు తనిఖీలు చేసి జరిమానాలు విధించడం పరిపాటిగా మారింది. కానీ క్షేత్రస్థాయిలో నిత్యం పర్యవేక్షించే అధికారులు లేకుండా పోయారు. గతంలో నిజామాబాద్ కార్పొరేషన్‌లో ఎంహెచ్‌వోగా విధులు నిర్వహించిన సిరాజుద్దీన్ ప్లాస్టిక్‌పై ఉద్యమం చేశారు. నిత్యం తనిఖీలు చేపట్టి చాలావరకు ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించారు. ప్రస్తుతం రెగ్యులర్ అధికారి లేకపోవడం, ఉన్నవారు తనిఖీలు చేయకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. బహిరంగ మార్కెట్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు.

### జ్యూట్ బ్యాగులు వాడాలి

ప్రభుత్వంతో పాటు ప్రజల్లోనూ మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రధానంగా మార్కెట్‌కు వెళ్లే సమయంలో చేతి సంచి, జ్యూట్ బ్యాగ్ తీసుకువెళ్లాలి. మాంసాహారం, ఇతర తినే పదార్థాల పార్సిళ్లలకు స్టీల్ డబ్బాలు వినియోగిస్తే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించవచ్చు. కానీ చాలా తక్కువ శాతం ప్రజలు మాత్రమే చేతి సంచులను వినియోగిస్తున్నారు. ఎక్కువ శాతం నేరుగా కొనుగోళ్లకు వెళ్లడంతో ప్లాస్టిక్ వినియోగం పెరుగుతుంది.

## జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలి

**అక్షరటుడే, కామారెడ్డి :** బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని కామారెడ్డి బీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్ విగ్రహాల వద్ద బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం గురువారం మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా 9వ షెడ్యూల్లో చేర్చి బీసీల హక్కులను నెరవేర్చాలన్నారు. తమిళనాడు తరహాలో 50 శాతం సీలింగ్ ఎత్తేసి బీసీలకు జనాభా దామాషా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, బహుజన రాజ్యాధికారమే ధ్యేయంగా ఉద్యమాన్ని నడిపిస్తామన్నారు. త్వరలోనే వెయ్యి మందితో కామారెడ్డి జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన దీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గాల వారీగా బీసీల చైతన్యం కోసం యాత్ర చేపడతామని తెలిపారు. అన్ని సంఘాలు, అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలను కలుపుకొని నిరంతరం పెద్ద ఎత్తున పోరాటాలు కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సాప శివరాములు, నీల నాగరాజు, కుంబాల లక్ష్మణ్ యాదవ్, పండ్ల రాజు, కన్నయ్య, పున్న రాజేశ్వర్, గుడుగుల శ్రీనివాస్, మల్లన్న, రాజేందర్, ఇర్ఫాన్, లలిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజన కార్మికులపై డీఈవో ఒత్తిడి సరికాదు




**అక్షరటుడే, ఇందూరు:** మధ్యాహ్న భోజన కార్మికులపై డీఈవో ఒత్తిడి పెంచడం మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెలకు నాలుగు సార్లు మటన్, చికెన్ పెట్టాలని డీఈవో చెబుతున్నారన్నారు. బహిరంగ మార్కెట్‌లో మాంసాహారం ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.13తో ఎలా వంట చేసి పెడతారని ప్రశ్నించారు. ఇప్పటికే కొంతమంది మధ్యాహ్న భోజన కార్మికులపై ఒత్తిడి పెంచుతున్నారన్నారు. సమావేశంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి హన్మాండ్లు, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి విరాళం




**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. అయితే ఈ ఆలయానికి రామ్‌నగర్ కాలనీకి చెందిన అడ్ల రేవతిభూమయ్య కుమారులు శ్రీతేజ్, రోహిత్ ముదిరాజ్‌లు రూ. 8,88,888 విరాళంగా అందజేశారు. ఈ మేరకు గురువారం ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరఫున దాతలను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గాజం మచ్చేందర్, పెద్ద బజార్ ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు బోండ్ల



## రాష్ట్రస్థాయి కబడ్డీకి ఇందల్వాయి పాఠశాల విద్యార్థిని

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న వి. కుసుమ ఎస్జీఎఫ్ అండర్-17 కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్ఎం వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం వివరాలు వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 7 నుంచి 9 వరకు ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో పోటీలు జరుగనున్నాయని వివరించారు. ఆ పోటీల్లో విద్యార్థిని కుసుమ నిజామాబాద్ జిల్లా జట్టు తరఫున పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థితో పాటు పీఈటీ భూపతి రాజేశ్వర్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం సన్మానించింది.



## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు ఉన్నత పాఠశాలకు చెందిన వాస్తవ్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ రాజేష్ తెలిపారు. ఈ 4న ముప్కాల్ మండలంలో జరిగిన ఎస్జీఎఫ్ అండర్-17 బాలబాలికల కబడ్డీ జిల్లాస్థాయి పోటీల్లో వాస్తవ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లాల కబడ్డీ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడనిచెప్పారు. ఎంపికైన విద్యార్థిని ఎంఈవో నరేందర్, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

## రిలే నిరాహార దీక్ష తాత్కాలికంగా విరమణ



**అక్షరటుడే, ఆర్మూర్:** అంకాపూర్‌లో అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరుతూ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రిలే దీక్షలను తాత్కాలికంగా విరమించారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో నాలుగురోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం దీక్షా శిబిరం నుంచి ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నిజామాబాద్, కామారెడ్డి సంయుక్త జిల్లాల కార్యదర్శి వి.ప్రభాకర్, డివిజన్ కార్యదర్శి బి.దేవారం మాట్లాడుతూ.. తాత్కాలికంగా దీక్ష విరమించినట్లు తెలిపారు.

## ముగ్గురు మహిళలకు జైలుశిక్ష..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ముగ్గురు మహిళలకు జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ స్పెషల్ కోర్టు సెకండ్ క్లాస్ జడ్జి తీర్పు చెప్పారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతంలో వీరు అసభ్యంగా ప్రవర్తించడంతో పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నగరంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతంలో బుధవారం రాత్రి ముగ్గురు మహిళలు అసభ్యంగా ప్రవర్తించారు. తమ శరీరం చూపిస్తూ పురుషులను ఆకర్షించే ప్రయత్నం చేశారు. పబ్లిక్‌లో న్యూసెన్స్ చేస్తున్న వారిని వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఉదయం కోర్టులో హాజరు పర్చగా.. ముగ్గురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

## బాలికపై అత్యాచారయత్నం.. నిందితుడికి ఐదేళ్ల జైలు

**అక్షరటుడే, కామారెడ్డి:** బాలికపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ మేరకు గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. 2022 సెప్టెంబర్ 18న బిచ్కుంద మండలంలోని ఓ గ్రామంలో పాఠశాలలకు సెలవు ఉండడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను అదే గ్రామానికి చెందిన జల్దేవార్ శ్రీనివాస్ తన దగ్గరికి పిలిచి అత్యాచారయత్నం చేశాడు. దాంతో సదరు బాలిక గట్టిగా అరవగా ఇంటికి కాస్త దూరంలో ఉన్న బాలిక నానమ్మ వచ్చి తలుపులు బాదడంతో ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించి పారిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక జరిగిన విషయం చెప్పడంతో మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం విచారణ చేపట్టిన పోలీసులు సాక్ష్యాలు సేకరించి కోర్టుకు సమర్పించగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వాటిని పరిశీలించి నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసును విచారించిన నాటి బిచ్కుంద సీఐ శ్రీధర్ రెడ్డి, పీపీ శేషు, ప్రస్తుత సీఐ మోహన్ రెడ్డి, సిబ్బందిని ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు.

## ఆర్మూర్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ రాజు గురువారం పరిశీలించారు. మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులతో పాటు 31వ వార్డులో జరుగుతున్న సీసీ కల్వర్టు, ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద పబ్లిక్ టాయిలెట్లకు డ్రెయినేజీ ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. ఆ తర్వాత మామిడిపల్లిలో పబ్లిక్ టాయిలెట్ల కోసం అనువైన స్థల పరిశీలన, పెర్కిట్ జంక్షన్ వద్ద హైమాస్ట్ లైట్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, చందు పాల్గొన్నారు.



## అర్హులందరికీ రేషన్ కార్డులు



**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందుతున్నాయని మల్లప్ప పటేల్ అన్నారు. మండలంలోని కాటేపల్లిలో గల రేషన్ షాప్‌లో గురువారం బియ్యంతో పాటు చేతిసంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా లబ్ధిదారులకు అందలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో దొడ్డు బియ్యం మాత్రమే ఇచ్చేవారని కాంగ్రెస్ హయాంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ అశోక్ పటేల్, కాంగ్రెస్ నాయకులు మొహియుద్దీన్ పటేల్, మొగలాగౌడ్, పర్వయ్య, గంగా గౌడ్, కిషన్, షఫీ, భారత్ నాయక్, రమేష్ దేశాయ్ పాల్గొన్నారు.